# సరస్వతి—పుష్పావతి

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

సరస్వతి సనాతన విద్యాభిలాషిణి; జాతీయ వాదిని: పుష్పావతి నవీన విద్యాసుందరి; ఇద్దరు విదుషీ మణులే; కాని సరస్వతి విజ్ఞానసుమము; వినయధురీణ; సహనవతి; శాంతస్వరూపిణి; భక్తపరతంత్ర; పూర్వాచార పరాయణానువ్రత; సాధుశీల; సద్గుణఖని; పతివ్రత.

పుష్పావతియన్ననో—వాగాడంబర; స్వాతంత్ర్య వాదిని; పాశ్చాత్య వేషాభిమానిని; అభిమానవతి; సనాతుల వెఱ్ఱిచాదస్తములు, నోములు వ్రతములు, పట్టె ఛాందసము కాని, ఆరోగ్యము కాదనియు, స్నానములు, తడిబట్టలు, రోగమూలకములుకాని శుచిత్వము కాదనియు, మొదలగు జాతిమత దూషణ ప్రియ స్వభావములో వీరిరువురకింతటి భిన్నమున్నను, అభిన్న స్నేహము స్థిరత్వము నొందియుండుటకు, సరిస్వతి సహనమే మూలము.

సర్వసంగ పరిత్యాగియగు సన్యాసికి, నితరుల, దూషణ భూషణ తిరస్కారము లోకలెక్కయా! అభిమానవతియగు పుష్పావతిమాటే, పైకి అవునంటే తీరిపోతుందన్న నిరాడంబర సరస్వతి యగుటచేతనే, వారి స్నేహము చెడకయుండెను. కాని జాతి, మత, విద్యా శీల విషయములలో నప్పుడప్పుడు వారికి భేదాభిప్రాయములు కలుగుచుండును. చివరకు సరస్వతి సమర్థన మతి చమత్కృతిశక్తిచే, పుష్ప-నిజము గ్రహించి మెచ్చుకొనుచుండును.

ఒకనాడు మధ్యాహ్నము పుష్పావతి, తాను వ్రాసిన వ్యాసముగల నూతన మాసపత్రిక నొకదానిని తెచ్చి, సరస్వతిని చదువమనెను. అప్పుడే ప్రియుని, కృత్యములుఁ దీర్చి, కచేరికిఁ బంపి, పిల్లల నిద్రబుచ్చి తీరికగా కూర్చుని, సరస్వతి, కుచేలోపాఖ్యానము, చదువుచుండెను. కుచేలుని భక్తిలో లీనమగుచు, లీలావతి పేదరికమున కశ్రువులు రాల్చుచు, అమాయకపు పిల్లల, యాకళ్ల కతిబేలపడుచు, కథలో కలిసిపోయిన హృదయముతో, కొంతసేపు చెలిని వీక్షింపనేలేదు. తదుపరి "పుష్పా? కూర్చుండుము. పనులైనవా?" అని ప్రశ్నించెను.

పుష్ప:—పనులకేమి కల్పన చేసుకుంటే అన్నీ పనులే, కడితిలోపడ్డ ఎలుకలాగ కొట్టుకుంటూ, చాకిరితోనే కాలము గడిపితే, మనం చూచేదేమిటి. వినేదేమిటి? చేసేదేమిటి. నిన్న క్లబ్బులో మీటింగు, స్త్రీలకు కావలసిన సమస్తహక్కులను గురించి, ఈవాళ హాలులో నుపన్యాసము, రేపు మ్యూజియములో ఆరోగ్యవారమగునట, నాటకములు, బహుమానములు, ఉపన్యాసములు, ఎన్నో వేడుకలు జరుగును. ఒక్కదానికి నీకు తీరికలేదుకదా? నాజీవితహాయి వీక్షింపుము చెలీ! లేచేసరికి పనులన్ని దాసి చేసేస్తుంది. నౌకరు, కాఫీ ఫలహారములు తయారు చేసి తెస్తాడు. హోటలునుంచి, మీల్సు వస్తుంది. మే మిద్దరము తింటాము. పిల్లాడికి, పిల్లకు, వాళ్లే పెట్టుకుని తినేటట్లు నేర్పేశాను. స్నానము చేయుట భోజనము చేయుట తప్ప, నాకు వేరు పనిలేదు. కొంతసేపేదో చదువుకుంటాను. ఏపత్రికకో, తమాషా నవీనకల్పన కథలు వ్రాసి పంపిస్తుంటాను. మా వారు, ఆఫీసుకు వెళతారు, పిల్లలు స్కూలుకు పోతారు. నేను తోచకుంటే, నీవద్దకిన్ని, మీటింగుంటే యక్కడికిన్ని అదీ లేకపోతే క్లబ్బుకిపోయి,

యే టెన్నిసో బ్యాడ్‌మింటనో, వార్తాపత్రికా వీక్షణమో, చేసివస్తాను. రాత్రికి మరల క్యారివస్తుంది. ఈలాంటి నా జీవితము సుఖమో-ఉదయాస్తమయములు, ఊపిరాడని చాకిరితో, పొయిసెగలతో కండ్లుపోవుచు, తల దువ్వుకొనుటకైన తీరికలేక చింపిరి జుట్లతో జిడ్డుముఖములతో, మలిన వస్త్రములతో, అలకలతో, ఆక్షేపణలతో, అత్తాడుపడుచుల జగడాలతో, పిల్లల యేడ్పులతో, ఇల్లెగిరిపోవు యజమానికేకలతో, ఎంగిళ్ల విరాకులతో, ఇల్లు అడివిలాగ, ఇల్లాలు అసహ్యముగాను, పిల్లలు పెంటిల్లాగ, కనబడుచు, లోకజ్ఞానము, పుస్తకపఠన, వ్యాయామములకు విశ్రాంతిలేని మీబోటివారల జీవితము సుఖమో ఆలోచించు. కళ్లుమూసికొని భక్తి భక్తీ అంటావు. కళ్లుతెరిచి లోకంపోకడలు చూడవు. ప్రాణనాథుని పదసేవనమే ముక్తిఅంటావు కాని. బాహ్యసౌఖ్యము లోకిుముక గనునించవు. ఏనాటి కథలో! నిజమో తెలియదు అబద్ధమో తెలియదు! పురాణములే నమ్ముకుని వాటినే ఆదర్శించుకొని సనాతన విద్యోఅంటో, సంస్కరణాభిలాష లేక, తాతలనాటి పాత కథల చదువుతూ కూర్చుంటావు. ప్రపంచకమెన్నిరకాల మారుతోంది! ఎన్నిరకాల వికుర్వనలు! ఎంత సంస్కరణ? నవీనులమగు, మనము నవీనయుగములో కాలచక్రముతో, బాటు పరిభ్రమణమొనరించాలికాని, కూపస్థమండూకాల్లాగ, పోతన భాగవతము, శ్రీనాథుని జీవితము. పెద్దనమనుచరిత్ర; యిత్యాది గ్రంథ కాలక్షేపమేకాని, ప్రకృతి స్వభావ జనిత కవిత్వమాధుర్య రసాస్వాదినులము కామేమే? ఎన్ని మాసపత్రికలు బయలుదేరాయి! ఎందరు నవీన కవి యువకులు, యువతులు బయల్పడ్డారు. ఎన్నితరహాల కథలు, కబుర్లు, చిత్రాలు, భావాలు!! ఒకటేమిటి. పూర్వులు, అనూయాపరులు. అందుకు తార్కాణము, పెద్దపెద్ద కవులమని, ఏదైనా వారే వ్రాయాలి. ఇతరులు వినాలి. వారిపేరే ప్రబలాలి. వారు నీతు లుపదేశించుట, లోకులు వినుట, ఆ ప్రకారంచేయుట ఇప్పుడు వారికెంత సహనమో చూడు. ఇంతమంది కవిత్వ మల్లు శక్తిగల్గుటకు, ఇన్ని పత్రికలు వికసించుటకు అందరిని ప్రోత్సహించి, వ్రాయించి, ఆదరించుటయే. సనాతన, నవీనుల ప్రవర్తనలు విదితమగుచున్నవి. చూడుము ఈ మాసపత్రిక !! ఎట్టిసాంఘిక కథలు ! ఎట్టి లోకజ్ఞానము ! స్వభావము తెల్పుచుండు నిట్టివే మనకు ముఖ్యజీవితాధారములు. సరస్వతీ ! యిది చదువుము.

సర:—పుష్పా చదవడానికేమిగాని నా కివి కూడును. అది కూడకఅను అనూయ యెంతమాత్రం లేదుసుమా ! ఎంత యుపన్యసించావు. నీవు నవీన ముగ్ధవు. వీటిని నమ్మిన నిన్ను నచ్చబెట్టుటకు, ‘భర్తృహరి సుభాషితము’లో చెప్పినట్లు బ్రహ్మకైనా తరంకాదు. పూర్వకవులను, కవిత్వాన్నికూడ నెంతచర్చించావు. అట్టికవిత్వరచనాసంపదిప్పుడేది? తాతలనాటి పాతకథలంటివి ! అట్టి యుత్తమ చరితల చరిత్రలవలననే, మన యార్యావర్త మన్నిఖండముల లోనికి, పవిత్ర ఖండమని పేరెన్నికగన్నది. మహాపతివ్రతల నివాసదేశమగుటచేతనే, పతిప్రేమ, నిర్మల జీవనము, గృహసౌఖ్యము, సత్ప్రవర్తన, దైవభక్తికి నిలయమై, మనోనిర్మలతఁ జెందియున్నది. భౌతిక సౌఖ్యముకన్న, ఆధ్యాత్మిక సౌఖ్యము మిన్నకదా? అప్పటి విద్యావిధానమునకు, ఇప్పటి విద్యావిధానమునకు తేడా నీకు కన్పట్టుటలేదా? పూర్వం, ఋషులు, శృతి స్మృతి, పురాణేతిహాసములు రచించిరి. అంతా ధర్మబోధ. క్రమేసి కావ్యరచన, రూపకరచన యీవిధంగా క్షీణించి ప్రస్తుతానికి కల్పలతకి, గడ్డిపువ్వులకుండు వ్యత్యాసమంత తేడాతో విద్య వృద్ధి పొందింది.

నవీనుల కవిత్వంలో, పదగుంభన అర్థపొందిక, కవిత్వరచన, కల్పనా నిర్మాణము ఏమున్నాయని ఇట్టి కవిత్వానికి? ఎంతమంది కవులు బయలుదేరలేమవుతారు. ఆదరించడానికనేక పత్రికలు, చదు

పుట కంతకంటె పెద్దపెద్ద రచన లర్థముకాని
యుభయభాసా విహీనలు!! అందుకనే గంతకుతగ్గ
బొంతలున్నారు. మనవేదాంతము మొదలుపెట్టినచోట
విదేశవేదాంత మంతమొందినదని విదితమే కదా?
అట్టివారి యాశ్రితులమగు మన కింతకన్న యున్నత
విద్య బలపడునా, మనది మరచితిమి. ఇతరులదిరాదు.
ఈ మిడిమిడి భావాలతో సరస్వతీదేవి నిష్టమువచ్చి
నట్లు పీకను పిసికేస్తున్నాము. ఏమిటో మీటింగులకు
నాబోటిది రానంతమాత్రాన, మీబోటి ఆంగ్లవిద్యా
ధురీణలకు కొఱతయా! ఏదో 'పేడపురుగులాంటి
జన్మ మాది! వినువీధి నతిస్వతంత్రంగాతిరిగే పక్షులంటి
వాళ్లు మీరు. ఏమి హక్కులు? గృహిణీపదంలో
స్త్రీకి గావలసిన సమస్త హక్కులు ప్రకృతియే
స్వభావంగా యిచ్చింది. ఆమె స్వభావం మంచిదైన
యెడల, భర్తయు, బిడ్డలుకూడ, యడుగుదాటని
యాజ్ఞానువర్తులై, సకల ఆలోచనలందును, మంత్రి
త్వము వహింతురు. మాతృత్వశక్తి; గృహపాలనశక్తి
స్వభావజనితంగా, స్త్రీ యధీనమే. ఇఁక పురుషు
లిచ్చునది మనం పుచ్చుకునేది ఏమిటంటే, వాళ్లవలె,
లేచిందిమొదలు, బిడ్డఁనైన సరకుచేయక, స్వాతంత్ర్యా
పేక్షతో, యిచ్చవచ్చిన 'చోటులకు వెళ్లడమేనా?
ఇంకా, వారిసత్వపు హక్కులని యాందోళన
చేయుట బాగుగనే యున్నది. ఎందువలనయంటే,
జోలెడాస్తి, తండ్రికాని, భర్తకాని, గణియించడ
మున్న, వారి యనంతర మీస్త్రీకి ।పురుషసంతానము
లేకున్నయెడల యే దాయాదియో, యే వారసుఁడో
కర్తయై, యావదాస్తియు ననుభవించుచుండగా అగ్ని
సాక్షిగా పెళ్లాడిన భార్యయు స్వగర్భజనిత యగు
కుమార్తెయు, తమవారి యాదాయములోని యను
భవములేక, దరిద్రకష్టము లనుభవించుచున్నారు. వారి
దుర్భర కష్టముల తొలగించుట కన్ని మీటింగులైన
చేసి, యెన్నిపాట్లయినఁ బడవచ్చును కాని, పురు
షులపై విజృంభణము, మనకుకూడదు. స్త్రీలపై
విజృంభణము, పురుషులకు కూడదు. అవునా!
పుష్పా!'

పుష్పా! 'ఏమో! నీమాటలు వింతగాయున్నవి.
ఎన్నటివో ప్రాతవారి మాటలాడతావుకాని, ప్రస్తుత
పురుషుల యవినీతులు నీవు కళ్లువిప్పి చూచుట
లేదు. భార్యయుండగా మరలమరల తనకిష్టమువచ్చి
నంతమందిని ఏదో సాకుఁజెప్పి పెళ్లాడ్డమెందుకు?
నల్లవారి కొకరీతి న్యాయము, తెల్లవారి కొకరీతి
న్యాయము కూడదని యేలాతలంచుచుండిరో, అట్టి
న్యాయమే మనవాళ్లు స్త్రీల కొకరీతిని, పురుషుల
కొకరీతిని యేలాగ చెల్లుబడిచేయుచున్నారు? వాళ్లకి
మనకు, సమానబాధ్యతఁగల బిడ్డలబాధలన్ని స్త్రీ
యనుభవించడమున్న, సర్వకాల సర్వావస్థలందు
వారితో వేగితంటాలు పడుచు, దేహారోగ్యములేక,
వాహ్యాళిలేక, ఇండ్లలో మగ్గడ మన్యాయముకాదా?
ఇవన్ని అణచాలి. అందుకనే, సర్వ స్వతంత్ర
హక్కులు కావాలని, మహిళామణు లాందోళనము,
సేయుచున్నారు. కండువా మార్చి కండువాలా,
భార్యలను మారుస్తున్నారు గనుకనే, మన స్త్రీలకు
కూడ విడాకులచట్ట మవసరమై యున్నది. నీ వింకా
పెరటిదారినే యున్నావు. ఛాందసురాలవు సరసూ!'

సర— (పుష్పచుబుకము పుణుకుచు) పుష్పా!
ఎంత వెఱ్ఱిదానవే! అనా మీవిజృంభణము, మన
పూర్వీకులకు, సీతా, దమయంతి మొదలగు కాంతలకీ
తెలివిలేకనా? వారందరు, పురుషులు చెప్పుకొరి
కితే, తాము సిద్దగొరికే, భర్తలను నీతిమంతులుగాను,
అనుకూలురుగాను చేశారా! తమ ధర్మబోధనశక్తిచే,
అవినీతులను, నీతివంతులుగను, అననుకూలుని, యను
కూలఁనిగను, నొనరించుకొని బాగుపడిరి. పశుపక్ష్యా
దులను, ప్రకృతినే విమర్శించి చూడుము. తల్లి సాకి
నట్లు, తండ్రి బిడ్డను పెంచఁగలఁడా? ఏడుగంత
తండ్రికంటె, ఏసులబుట్టంత తల్లిమేలని సామ్యమే
యున్నది. స్తన్యపాన మెచ్చటకలదో, అచ్చటనే
శిశుపాలన, రక్షణఁ జరగాలి. ధనతముకొలది, పురు
షుల వశముచేసి, స్త్రీలు పలుచోట్లకుపోతే, పదిసం

స్థలందు తిరుగు పురుషుడు బాహ్యవ్యాపారజనితాలోచనాధీనుఁడై, బిడ్డల నేమరియుండును. దాన మనకే నష్టము. దీనికొక తార్కాణము, పేపర్లలో నే యామధ్య వేసినారు. వినుము. పాశ్చాత్యసుందరి కున్న స్వేచ్ఛావిహార లచే, దాయీపరమునునుంచిన, బిడ్డ, వీధిలో నాడుచు, విధివశమున, తల్లివచ్చు కారు క్రిందనేపడి మరణించెనట. తల్లికంటె, దాయీ కెక్కుడాపేక్షయా, లేక, ఎక్కువ ప్రేమా! మగవాఁడు, సిగరెట్లు త్రాగినాడని, అవి మాన్పించడానికి, నయబోధనాశక్తి లేక, ప్రతిగా శాస్తిచేయుటకై, మనం కాల్చడమా! దీనివలన, వాళ్లు మానరు. మనకు, లేని దలవాటు! దుర్వ్యయము, రెట్టింపగుటయు స్త్రీగూడ, దుర్వ్యసనములందు చిక్కుట సంభవించును. ఇది మంచిదా?

పురుషులు ధర్మము మీరలేదా యనుచుంటివి. వారు పాశ్చాత్యగాలులచే, తమ ధర్మములు మరచినారని మాతృస్థానములమగు మనము, భూకంపప్రళయాలకు భూమితిరుగునట్లు, చలించుటేల? విడాకులుచ్చుకొని వారేమి బావుకొనుచున్నారు? ఏతప్పు, నీవు చేయకూడదని, పురుషుల నిందించుచుంటివో, ఆతప్పు తిరిగి నీవే కోరుటెందులకు? ఒకదొరసాని, పెండ్లాడిన మరుచటిదినమే, భర్తగుఱ్ఱు భరించలేనని, కోర్టులో విడాకులకు దరకాస్తు చేసిందని, వార్తాపత్రికలో వ్రాశారు. ఇట్టి దాంపత్య మెంతటి విలువో, ఎంతటి స్థిరమో, ఎంతటి పవిత్రమో, ఆలోచించు. ఇఁక, నీయిల్లు, నీవాళ్లు, నీవి, అని, స్థిరమగు నివాస మెద్ది. మీ పిల్లలు, నా పిల్లలు, పోగడి, మనపిల్లలను కొట్టుచున్నారందిట, విడాకులు పొంది, ద్వితీయవివాహమాడిన యువతి, రెండవపెండ్లివాడగు భర్తతో. ఇట్టి స్త్రీని, ఎంతమంది భర్తలై, భరించెదరు? ఇది పబ్లికు వ్యభిచారిణి యగును. అందుచే, మనము భరింపలేని కష్టములిచ్చు భర్తలకొక మంచిదారి నిచ్చు నిబంధనల చట్టము లేర్పరుచుకొన నాందోళనములు సల్పవలెనే కాని, ఇట్టి ప్రాయశ్చిత్తములుకాదు వారికిచేయుట. ఇరువురు యవినీతులచే, క్రమంగా, సంఘము క్షీణించి, కుక్కగొడుగులవలె పుట్టు, సంఘాములట్టె యంతరించి, పునః నాల్గువేల సంవత్సరాలక్రిందటి ధర్మాలు ప్రవర్తింపఁజేయు, పాట్లుపడవలనుండును. ఇట్టి యుత్పాతబుద్ధులు, అసలుకే మోసము తెచ్చును. మళ్లీ పునః సృష్టి చేయడానికి, మహాత్మ్ములుద్భవించి క్రొత్త విద్యలు సృష్టించి, మీటింగులు చేయాలి. ఇంకొకటి: అతిబాల్యవివాహాలవలన, చాలా నష్టములని శ్రీ శారదాగారొక ప్రౌఢవివాహచట్ట మేర్పరచి, కృతార్థులైరి కదా? ప్రౌఢవివాహములచే, బాలికలు, అనుకూలవరుల నెన్నుకొని, సుఖజీవిత లగుదురుకదా? ఇఁక, నట్టి దాంపత్యములో, విడాకుల కవకాశమెద్ది? ఇట్టి సదవకాశము లభించిన సమయములలో, అధర్మయుతమగు విడాకులచట్ట మేర్పాటుల యాందోళన మేల? ఇంతకూ నాలోచిస్తే, నిజంగా, విడాకులు, ప్రౌఢవివాహబాధ్యులగు పాశ్చాత్యులకే కావలసి వచ్చింది. మన ఆర్యధర్మబద్ధ పవిత్రగృహిణి కక్కర నే లేదు. "స్వధర్మే నిధనం శ్రేయః, పరధర్మో భయావహః" యని, గీతలో శ్రీకృష్ణభగవానుఁడానతిచ్చియున్నాఁడు కదా? హిందువులకు, గీతయే కదా ఆదర్శము. పాశ్చాత్యుల బైబిలులను, వా రతిక్రమించుచున్నారా? మహమ్మదులఖురానును, వా రుల్లఘించుచున్నారా? ఉభయభ్రష్టత్వముగా, మన స్వధర్మములు, మనము మీరి, పరధర్మానుష్ఠాన బుద్ధి మనకేల? ఇంతెను, మన మిప్పుడు స్కూళ్లలో చదువు విద్య యట్టిది. దాని ప్రభావ ముద్ధుల మగుటచే నట్టి కాంతు లుత్పన్నమై పీడించుచున్నవి. త్రిశంకు స్వర్గములాగ, మధ్య నూగాలికాని, మనము వారి దేశీయులముకాక, నలుపుదేహుల మగుటచే, వా రాదరించరు. స్వధర్మభ్రష్టుల మగుటచే, మనవా

రామోదించరు. ఇఁక మనగతి, గతేయగును. అందుచే, విద్యావిధానము నీతి, మత, ధర్మ, గృహపాలన, విధానములచే మారాలి. అంతవఱకు మనకింతే. హృదయపరివర్తనము, దేశమోక్షము, మనకు ముఖ్యములా? వాగాడంబరములతో, లేనిపోనివి కావలెనని మననేరము లితరులతో మొరపెట్టుకొని, వారి యధీనులమై, వారి శరణుఁజొచ్చుట మేలా! పుష్పా! నీ వీరాత్రంతా హృదయంలో విమర్శించు.

పుష్పా:—(ఒకించుక స్వాలోచనాధీనయై) "అక్కా! సరస్వతీ! మాతృస్వరూపిణివి. భౌతికానందురాలగు, నాజన్మను, ఆధ్యాత్మిక బోధానందముచే, తరింపఁజేసితివి. అత్షణిక కోరికల నావలికి ద్రోయించి, శాశ్వతమైన, యనుభవపట్టిక నెలకొల్పితివి. నమస్కారమక్కా! ఇంతటినుండి, నీ యాజ్ఞానువర్తిని," అని సరస్వతి సెలవుపొంది, బిడ్డ లేడ్చుదు రేమో యను, భీతి యుదయింప, పతిప్రేమ పొంగిపొరల, నిజగృహమున కరిగెను.

అంతటినుండి, పుష్పావతి, హోటలుమీల్సు మానిపించి, స్వహస్తపాకము చేయుచుండెను. దాదుల యధీనమునుండి. బిడ్డలను తప్పించి, బిడ్డలస్వకృత్యముల, స్వంతముగాఁ జేసికొనుచుండెను. ఇంతయేల, సరస్వతివలె 'గృహిణి' యని యనిపించుకొనుచుండెను.

# దాంపత్యము

" సీ॥ ఇగురుజొంపంబుల నింపారు విరులను బలుపైనపొదల గ్రేవలకుఁ దార్చి।
సెలయేరులందలి తెలినీటఁదనుపు సొంపెలసినగిరుల తెప్పలకుఁజేర్చి।
మావిమ్రోఁకల నెలదీవలఁ జెన్నొందు తోఁటలకడ నలి తోడఁబొంది।
అలరునెత్తమ్ముల కలిమిఁజెల్వగు డిగ్గియలతీరభూముల నల్లబొంది।
నన్ను మనము నఁదేల్చి యానందమొందఁ గేలిసలిపెడు నీదగు లీలమఱవ।
నావశంబె ప్రాణేశ ప్రాణంబులిపుడ నిన్నకూర్చియే తెంతు నీసన్నకడకు ॥ "

భారతము.